# రేపటి కథ




పాపం వసంత! బస్సుకోసం ఎదురు చూస్తుంది. పాపం ఆవిడ ఇంటి పేరనుకునేరు! వసంతని తెలిసిన వాళ్ళందరూ అలానే అంటారు. కారణం! పాతికేళ్ళు దాటినా ఆమెకు పెళ్ళి కాలేదు. అలాగని అందం లేదనుకుంటే పొరపాటు. వసంత అందగత్తె! ఎంత అందమంటే

---

డి. రాజ్యలక్ష్మి

---

చిదిమి దీపం పెట్టొచ్చు అనుకునే అందం. కానీ ఆమె ఏ ఇంటికీ దీపం కాలేక పోయింది.

దూరంగా వస్తున్న బస్సు చూసి 'ఏదో బస్సు వస్తుంది! అది చిక్కడపల్లి బస్సయితే బావుణ్ణు' అనుకుంటూ అటువైపే చూస్తూ నిల్చుంది నెమ్మదిగా నిండు చూలాల్లా వస్తున్న బస్ నంబర్ చూసి కాస్త నిరుత్సాహ పడింది వసంత. వసంత నిరుత్సాహంతో పనిలేని బస్సువచ్చి ఆగి కొంత మందిని దింపి మరికొంత మందిని ఎక్కించుకుని కదిలింది

వసంత రాని బస్సుమీద విసుక్కుంది. అంతవరకూ ఏదో కొంపలంటుకుపోయే పనంటూ ఆఫీస్‌లో వుంచేసిన సూపర్నెంట్‌నూ విసుక్కుంది అతని మాటకు ఎదురు చెప్పలేని తన అసమర్థతకు తన్ను తానే విసుక్కుంది.

ఓ కుఱ్ఱవాడు చేతికి ఓ బుట్ట తగిలించుకుని "పల్లీబటానీ! గరమ్ గరమ్ పల్లీ బటానీ!!" అంటూ బస్‌స్టాప్‌లోని మనిషి మనిషి దగ్గర అరుస్తున్నాడు కొంటారేమో అన్న ఆశతో! ఎవరూ కొనటంలేదు. చివరికో హిప్పీల తాలూకు జులపాలవాడు పదిపైసల పల్లీలు కొన్నాడు. అతి నాజూగ్గా పల్లీలు తింటూ, మధ్య మధ్య తల ఎగరేస్తూ ముందుపడిన జుట్టు వెనక్కి వేసుకుంటున్నాడు. అక్కడున్న అందరి కళ్ళూ అతనిమీదే వున్నాయి. వాడి కళ్లు మాత్రం వసంతమీదున్నాయి.

'ఎవడో జులపాల వెధవ ఇటే చూస్తున్నాడు! వాడు వాడిమొహం! అచ్చు జూలో చింపంజీలా వున్నాడు. ఏమిటి! నవ్వుతున్నాడు సిగ్గు లేకుంటే సరి!' జులపాల వెధవను తిట్టుకుంటూ చూపు తిప్పుకుంది వసంత ఓ జంట!

ఒకర్నొకరు రాసుకుంటూ లోకం సంగతి మరిచిపోయి చేతిలో చెయ్యి వేసుకుని పోతున్నారు ..

'వీళ్ళకు సిగ్గనిపించదు గాబోలు! వీధిలో, రోడ్డుమీద అలా, ఛ ఛా! అతనికి లేకపోతే ఆమెకైనా! తనైతే అలా ఎన్నటికీ చెయ్యదు అతనికదే ఇష్టమైతే తను మాత్రం ఏం చేస్తుంది!... ఛా పాడుఆలోచనలు తన్నెవరు చేసుకుంటారు ఈ మొహానికి అది కూడానా!'

చిక్కడపల్లి వెళ్లే బస్సెక్కింది వసంత. కండక్టర్‌కు డబ్బులిచ్చి టికట్ తీసుకొనేటప్పుడు కండక్టర్ చెయ్యి కావాలనే పట్టుకోవడంతో వసంతకు ఎక్కడలేని కోపం వచ్చింది. "డర్టీ బ్రూట్స్!" అని తిట్టుకుంటూ గబుక్కున టికట్‌తోపాటు చెయ్యి తీసుకుని తనకొచ్చిన అన్ని భాషల్లోను లెక్కలేనన్ని సార్లు తిట్టుకుంది.

చిన్నగా ఏదో రాగం వినిపించడంతో వసంత ప్రక్కకు చూచింది. ఎవరో టక్ చేసుకున్నతను ట్రాన్సిస్టర్ ఆన్‌చేసి తిరిగి ఆపేశాడు. 'నాకూ రేడియో వుంది అని అందరికీ తెలియాలని కాబోలు ఏమిటది! అలా చూస్తున్నాడు! ఛీ మగవాళ్ళంతా ఇంతే!' వసంత తల విసురుగా తిప్పుకుంది.

"లిబర్టీ! ఉర్దూహాల్!! హిమయత్ నగర్!!!" పది నిమిషాల్లో ఆరుసార్లు

అరిచాడు కండక్టర్। మూడు స్టాపులు దాటింది బస్సు.


మరోసారి ఎందుకో టక్‌వాలావైపు చూసింది వసంత అతను ఈసారికూడా నవ్వాడు వసంతకు చెప్పలేనంత కోపం వచ్చింది 'ఆ పళ్ళు పీకేస్తే సరి।' అనుకుంటూ చూపు తిప్పుకుంది కానీ అతని రూపం వసంత కళ్ళనుండి చెరిగిపోలేదు నొక్కులజుత్తు।బాలరాజు మీసం।। ఆ ముఖంలో ఎంతో అందంగా వున్నాయి. సూపర్నెంట్ మొహంలా కాకుండా। అందంగా వుంటేమాత్రం। పళ్ళికిలించాలా?

''నారాయణ గూడ।'' అన్న కేకతో టక్‌వాలా గబగబా చేతిలోని ట్రాన్సిస్టర్ జేబులో పెట్టుకుని దిగాడు. మరోసారి అతనివైపు చూసింది వసంత పట్టువదలని విక్రమార్కుడిలా మళ్ళా నవ్వాడతను.

వసంత కలాంటి నవ్వులు కొత్తేం కాదు. చదువుకునే రోజుల్లో కొందరు కుఱ్ఱవాళ్ళు వసంతను చూసినప్పుడు అలానే నవ్వేవారు కొందరు మాస్టర్లనబడే బాస్టర్లు అలానే నవ్వేవారు. ఉద్యోగంలో చేరినప్పటి నుండి ఎత్తు పళ్ళను, ఎలక పళ్ళను, కొక్కిరి పళ్ళను, బంగారు పళ్ళను ఇంకా ఎన్నో పళ్ళను చూసింది వసంతకు అందరి పళ్ళలోను ఒకే భావం కనిపించేది ఒక్క రాజు నవ్వులో తప్ప.

రాజు పద్మకు బీరకాయపీచు సంబంధంగా తమ్ముడవుతాడు. పద్మ. వసంత ఇల్లనబడే రెండు గదుల్లో వుంటున్నారు. పద్మకు పెళ్ళయినా ఒంటరి బ్రతుకే మిగిలింది. భర్తతోపాటు పద్మ ప్రైవేట్‌గా ఎం. ఏ. పరీక్షలకు కూర్చుంది. అతను ఫైలయినా పద్మకు క్లాస్ వచ్చింది.

అతనిలో 'ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు।' అనబడే రోగం ముదిరి భార్యకు విడాకులిప్పించింది పద్మ స్వతంత్ర భావాలున్న మనిషైనందున ఉద్యోగంలో చేరి తన బ్రతుకు తను బ్రతుకుతోంది. పెళ్ళి కాని వసంత, పద్మలు తోడులేని జీవితాలలో



ఒకరికొకరు తోడుగా వుంటున్నారు.

"చిక్కడపల్లి!" అన్న కేకతో వసంత గబగబా బస్సు దిగి నెమ్మదిగా అడుగు లేస్తుకుంటూ పది నిమిషాలకు ఇల్లు చేరుకుంది.

వరండాలో మౌనంగా ఆలోచిస్తూ కూర్చున్న పద్మ, రాజులు వసంత రాకతో ఆలోచనల్ని కట్టిపెట్టి వసంత వైపు 'వచ్చావా!' అన్నట్టు చూశారు.

"ఏమిటలా వున్నారు!" అడిగింది. వసంత

"ఏం లేదు! ఇంత ఆలస్య మైందేం! నీ కోసమే ఎదురు చూస్తున్నాం! ముందు ముఖం కడుక్కోనిరా!" అంది పద్మ.

"ఏమిటి అక్కా తమ్ముళ్లు నాకోసం ఎదురు చూస్తున్నారా!" అంటూ ఇద్దరి వంకా చూస్తూ కాస్త ఆశ్చర్యంగా అడిగింది వసంత పద్మ, రాజు అవునన్నట్టు చిన్నగా తలవూపారు. "అయితే ఇప్పుడే వస్తా!" అంటూ వసంత లోనికెళ్ళింది మరి కాస్సేపటికి పద్మ "కాఫీ తెస్తా!" నంటూ వెళ్ళి ఓ అయిదు నిమిషాల తరువాత మూడు కప్పులు ఓ ట్రేలో పెట్టుకొని వచ్చింది. ఆమె వెనకాలే వసంత తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ వచ్చింది, పద్మ వసంతకు రాజుకు చెరో కప్పు ఇచ్చి తనూ ఓ కప్పు తీసుకొని ట్రే క్రింద పెట్టింది

ఎవరూ ఎవర్ని మాట్లాడించకుండా కాఫీ త్రాగుతూ కూర్చున్నారు మసక చీకట్లు ముసురు కుంటూ ఎలక్ట్రిక్ దీపాల్ని మరింత తేజోవంతం చేస్తున్నాయి అల్లరి గాలి గిలిగింతలకు గోడకు వ్రేలాడుతున్న రెండు కాలండర్లూ ఎగిరెగిరిపడుతున్నాయి.

కాఫీ త్రాగడం ముగించి ముగ్గురూ ఒకర్నొకరు చూసుకున్నారు. ఆ మౌనాన్ని భరించలేని వసంత "ఏమిటలా బిగుసుకుపోయి కూర్చున్నారు!" అంటూ అడిగింది.

"మా తమ్ముడు పెళ్ళిచేసుకుంటాడట!" అంది పద్మ.

'ఈ విషయం చెప్పడానికా!' అనుకుంటూ "కంగ్రాచులేషన్స్ రాజు. ఎప్పుడు?" కుతూహలంగా అడిగింది వసంత.

"ఎవర్నని అడగవేం?" అంది పద్మ. వసంత 'ఎవర్ని!' అన్నట్లు పద్మవైపు చూసింది. పద్మ 'చెప్పు!' అన్నట్లు తమ్ముడివైపు చూసింది. రాజు వసంత వైపుచూసి అలానే ఆ చూపు అక్కగారి వైపు తిప్పి "నే నెలా చెప్పను!" అన్నట్టు తలవంచుకున్నాడు. మరి కాస్సేపటికి ఇహ తప్ప దనుకొని "నిన్నే!" అంది పద్మ

"నన్నా!" ఆశ్చర్యంగా గొణిగింది వసంత "ఏమిటిది! ఇది నిజమా!! రాజు తన్ను పెళ్లిచేసుకుంటాడా!!! తనకన్నా మూడేళ్లు చిన్నవాడు తన కెప్పుడూ అలాంటి ఆలోచనే లేదే !'

'ఔను వసంతా! నీకిష్టమైతే! వెంటనే!!' మధ్యలో ఆగిపోయింది పద్మ స్వరం

వసంతకు ఇదేదో చిత్రంగావుంది. ప్రేమించి పెళ్ళి చేసుకుంటారు! ఆ ప్రేమ రెండు వేర్వేరు కులాలకు చెందిన వారి మధ్య అంకురించిందన్నా ఆశ్చర్యపడ్డానికి వీల్లేదు అదీ సహజమే! కానీ తనకన్నా పెద్దదాన్ని ఏ పురుషుడూ పెళ్ళి చేసుకోవడం తనెక్కడా వినలేదు

"రాజు నిర్ణయం విని నేనూ నీలానే ఆశ్చర్యపడ్డాను తరువాత ఆలోచించి రాజు నిర్ణయం ఆవేశంతో తీసుకున్నది కాదని తెలుసుకున్నాను. కేవలం తనకన్నా

మూడేండ్లు పెద్దదైనంతమాత్రాన ప్రేమించ కూడదని ఎక్కడాలేదు. మగవాడు తన కూతురి వయసులోవున్న అమ్మాయిని మూడో పెళ్ళి చేసుకోంగా లేని తప్పు తన కన్నా కాస్త పెద్దదాన్ని చేసుకుంటే తప్పా? '' అంది పద్మ

''అక్కయ్యా! ఇందులో తొందర పడాల్సిందేమీ లేదు '' అంటూ పద్మకు చెప్పి వసంతను చూస్తూ ''మీరూ ఆలో చించండి! మీ కిష్టమైతేనే ఏదైనా మరి నే వస్తా!'' అంటూ శలవు తీసుకొని లేచాడు రాజు

పద్మ వసంతను ఏమీ బలవంతం చెయ్యలేదు కాకపోతే భోజనం చేసే టప్పుడు ''చేసుకోవడంలో తప్పలేదు!'' అని ఒకటికి పదిసార్లు నొక్కి చెప్పింది

ఆ రాత్రి పడుకుందన్న మాటేగాని వసంతకు కళ్లు మూతలు పడ్డంలేదు మన సంతా భవిష్యత్ ను గూర్చే ఆలోచిస్తుంది.

వసంత మధ్యతరగతి కుటుంబంలోనే పుట్టింది పుట్టిన వెంటనే తండ్రిని చంపిం దనే అపవాదుతో పెరిగింది. వసంత తల్లి తన అన్న తన కన్యాయం చెయ్యడని, వసంతను కోడలుగా చేసుకుంటా డను కుంది. దానికతను ఏనాడూ అడ్డు చెప్ప లేదు కాని వసంత ''కాలేజీలో చేరు తాను!'' అన్నప్పుడు మాత్రం నా కోడలు దొరసాని చదువులు చదివి మమ్మల్ని వుద్ధ రించాల్సింది లేదని ఖచ్చితంగా చెప్పాడు. వసంత ఎవరెన్ని చెప్పినా వినకుండ కాలే జీలో చేరింది ఆ ఏడే వసంత మామ అతని కొడుక్కి పెళ్ళిచేశాడు. ఉన్న ఒక్క ఆశ అలా అయిందని వసంత తల్లి ఎంతగానో బాధ పడినా కూతురు మనసు నొప్పించలేదు. ఈనాడు కాకుంటే రేపైనా ఎవరైనా చేసుకోరా అనే ఆశలో వూపిరి నిలుపుకుంది. వసంత ఉద్యోగంలో చేరడంతో ఆ ఆశ అడియాశయింది. ఒక రిద్దరు వసంతను చేసుకుంటామని వచ్చారు. ఆ వచ్చిన వాళ్ళకది రెండో కళత్ర మైనా వసంత తల్లి వసంతను ఎంతగానో బతి మాలింది. కాని లాభంలేకపోయింది. చివరకు కూతురికి పెళ్ళికాదు! ఇహ దానిది ఒంటరి బ్రతుకే!! అని వసంతను ఒంటరి దాన్నిచేసి తనదారి తాను చూసుకుంది.

'రాజును పెళ్లిచేసుకుంటే బాగానే వుంటుంది రాధ కృష్ణుడికన్నా పెద్దదే నట ఎక్కడో చదివింది తను ఆ మాట కొస్తే సీతకూడ రాముని కన్నా పెద్దదే అంటారు చాలామంది వాళ్ళు దేవతలు వాళ్లేం చేసినా చెల్లుతుంది.

పాతికేళ్ళు దాటిన పడతులకు చాలా మటుకు పెళ్ళికాదు. అందునా ఉద్యోగస్తు లయితే ఇహ చెప్పక్కరలేదు వాళ్ళు జీవితాంతం కన్నెలుగానే జీవిస్తారు. అలాంటప్పుడు తన్ను మనసారా కోరు కొనే రాజును పెళ్ళిచేసుకోవడంలో తప్పేం వుంది! తనకూ అందరిలానే జీవితంలో ఓ తోడు కావాలి రాజు అందరిలాటివాడు కాదు అతనికేం తక్కువ లక్షణమైన ఉద్యోగం! కేవలం వయసులోని తేడాలు జీవితంలో విషాదపు నీడల్ని పరుస్తాయా! ఒకవేళ అలాగే అయితే తన కథ భావితరా నికి ఓ చేదునిజంలా వుంటుంది. ఏది ఏమైనా తను రాజును పెళ్లిచేసుకుంటుంది. ఎవరేమన్నా పర్వాలేదు' అనుకుంది.

వసంత నిర్ణయానికి హర్షిస్తూ, రేపటి కథకు శుభం పలుకుతూ పక్కింటి గడి యారం పన్నెండుగంటలు కొట్టింది ★